సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 4 । మార్చి । 2025



జరిమానాల మోత..
నూతన వాహన చట్టం ప్రకారం నిబంధనలు మీరితే జరిమానాలతో పొకిచ్చేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. 8లో ▸



	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
భీమవరం	6.17	4.59
నరసాపురం	6.17	4.57
తాడేపల్లిగూడెం	6.12	5.07

రంజాన్ వేళలు



ఆటో బోల్తా
నూజివీడులోని రామాయమ్మరావుపేట వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో నలుగురికి తీవ్రంగా, 14 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

అంబేడ్కర్‌ను దూషించిన వారిపై ఫిర్యాదు



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): విదేశాల్లో ఉంటూ కొందరు టిక్‌టాక్ ద్వారా అంబేడ్కర్‌ను దూషిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్‌ను అవమానించేలా ఉన్న వీడియోలను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నేతల సాల్మన్ రాజు, చిగురుపాటి రాజేష్, పిట్టా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 15,950 మంది హాజరు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలను 52 కేంద్రాల్లో నిర్వహించామన్నారు. జనరల్ కేటగిరీలో 14,908 మందికి 14,499 మంది, ఒకేషనల్ కేటగిరీలో 1,544 మందికి 1,451 మంది హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

89 శాతం మంది హాజరు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షకు 89.33 హాజరు నమోదైందని డీఈఓ నారాయణ తెలిపారు. 1,134 మందికి 121 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగిరపర్చాలి



సర్వేను పరిశీలిస్తున్న జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): ఎంఎస్ఎంఈ సర్వే త్వరగా పూర్తిచేయడానికి చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులు అధికారులకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం బస్టాండ్, 20 వార్డు మసీదు రోడ్డులో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే తీరును సోమవారం ఆయన పరిశీలించారు. అధికారులు సర్వే త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఉన్నారు.

8న మహిళా దినోత్సవ ర్యాలీ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఈనెల 8న మహిళా దినోత్సవ ర్యాలీ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. ప్రకాశం చౌక్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సుమారు వెయ్యి మంది మహిళలు, విద్యార్థినులతో భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఎంహెచ్ఓ బి.భాను నాయక్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ పరిశోధకురాలికి అవార్డు



నన్నయ్య వర్సిటీ ప్రిన్సిపాల్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రశాంతి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ టీచింగ్ స్టాఫ్ మెంబర్ డాక్టర్ ఎస్.ప్రశాంతికి సేంద్రియ రసాయన శాస్త్రంలో యువ మహిళా పరిశోధకురాలుగా అవార్డు వచ్చింది. ఆమెను సోమవారం వర్సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ అభినందించారు. అంతర్జాతీయ ప్రచురణలు, పేటెంట్లు, రచించిన పుస్తకాలలో ఆమె ప్రతిభను గుర్తించి చెన్నైలోని వీనస్ ఇంటర్నేషన్ ఫౌండేషన్ అవార్డును ప్రదానం చేసింది. అలాగే అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్రీ టీచర్స్‌లో ఆమెకు జీవితకాల సభ్యత్వం ఇచ్చారని ప్రిన్సిపాల్ అశోక్ కొనియాడారు.

పట్టభద్రుల కౌంటింగ్ ప్రారంభం

ప్రహసనంలా ప్రక్రియ
- రాత్రి 10 గంటలకు మొదటి రౌండ్ లెక్కింపు
- 12 గంటలకు పైగా సాగిన బ్యాలెట్ కట్టల విభజన
- 28 టేబుళ్లలో 17 రౌండ్లలో లెక్కింపు
- తొలి 8 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్
- ఆరు జిల్లాల పరిధిలో పోలైన ఓట్లు 2,18,997
- నిరంతరాయంగా సాగుతున్న ప్రక్రియ



ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఇన్‌వ్యాలిడ్ ఓట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఏలూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వి నేతృత్వంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. స్ట్రాంగ్‌రూమ్ కూడా ఇంజనీరింగ్ కళాశాలలోనే ఏర్పాటు చేయడంతో కౌంటింగ్ హాలుకు బ్యాలెట్ బాక్సులు తరలించారు. ఉభయగోదావరి జిల్లాల్లో 2,18,997 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా గతనెల 27న జరిగిన పోలింగ్‌లో 69.50 శాతం పోలింగ్ నమోదైంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కూటమి బలపరిచిన టీడీపీ నేత పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులతో పాటు మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్‌కుమార్‌తో పాటు 32 మంది స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు.

ఉదయం 6.30 గంటల నుంచి..

ఉదయం 6.30 గంటలకు పోలింగ్ కేంద్రంలో సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. కలెక్టర్ పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు తరలించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ హాలులో 28 టేబుళ్లను ఏర్పాటు చేసి 17 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు బ్యాలెట్లు కట్టలు కట్టేందుకు సమయం పట్టింది. ఉభయగోదావరిలోని ఆరు జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాల్లో 1,368 బ్యాలెట్ బాక్సులు వినియోగించారు. వీటన్నింటినీ అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచి ఓట్లను కట్టలు కట్టి అనంతరం



పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

చెల్లిన, చెల్లని ఓట్లను గుర్తించి లెక్కింపు ప్రారంభిస్తారు. మొదటి 8 రౌండల్లో మొదటి ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు.

700 మంది సిబ్బంది.. 24 గంటలూ విధులు

ఆరు జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, ఉద్యోగులు మూడు షిఫ్టుల్లో కౌంటింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి షిఫ్టునకు సుమారు 240 మంది సిబ్బంది 8 గంటలపాటు పనిచేసేలా విధులు కేటాయించి ముందస్తుగానే కౌంటింగ్‌కు సంబంధించి శిక్షణా తరగతులు కూడా నిర్వహించారు. ఆరుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 22 మంది ఎస్సైలు, 38 మంది ఏఎస్సైలు, 92 మంది కానిస్టేబుళ్లు, 166 మంది హోంగార్డులు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.

జిల్లాల వారీగా పోలైన ఓట్లు

జిల్లా	ఓట్లు	పోలింగ్ శాతం
ఏలూరు జిల్లా	29,651	70.13
పశ్చిమగోదావరి	48,893	69.80
అల్లూరి సీతారామరాజు	3,637	77.90
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	47,125	73.90
తూర్పుగోదావరి	42,446	67.41
కాకినాడ	47,150	68.84

లెక్కింపు ఇలా.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు భిన్నం. పోలైన ఓట్లల్లో చెల్లే ఓట్లను పరిగణనలోనికి తీసుకుంటారు. 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు 2,20,000 ఓట్లల్లో సుమారు 1,10,001 ఓట్లు 17 రౌండ్లకుగాను మొదటి 8 రౌండ్లల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధించిన అభ్యర్థి విజేతగా నిలుస్తారు.



బ్యాలెట్ పేపర్లను అంకెల వారీగా విడదీస్తూ..

రాత్రి 10 గంటలకు తొలి రౌండ్

ఓట్లు కట్టలు కట్టడం, చెల్లిన, చెల్లని ఓట్లు గుర్తింపు, మొదటి ప్రాధాన్యత ఓట్లు గుర్తింపు ప్రక్రియంతా పూర్తి చేసుకుని సుమారు రాత్రి 10 గంటల సమయంలో మొదటి రౌండ్ లెక్కింపు 28 టేబుళ్లల్లో ప్రారంభమైంది. మొదటి రౌండ్‌లో సుమారు 28 వేల ఓట్లను లెక్కించగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు 16,520 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి దిడ్ల వీర రాఘవులకు 5,815 ఓట్లు వచ్చాయి.

2,18,997 ఓట్లు.. 17 రౌండ్లు



ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల ఏజెంట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,18,997 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్లను లెక్కించేందుకు 17 రౌండ్లల్లో 28 టేబుళ్ల ఏర్పాటుచేశారు. మొదటి 8 రౌండ్లల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కించడం, అంతకు ముందే చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసే పనిని కౌంటింగ్ సిబ్బంది పూర్తి చేశారు. లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను సోమవారం ఉదయం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఏలూరు ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్‌లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. కూటమి పార్టీల మద్దతుతో టీడీపీ నేత పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థిగా రిటైర్డ్ టీచర్ దిడ్ల వీరరాఘవులతో పాటు 33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ ఉంది.

ప్రాధాన్యతా క్రమంలో..

28 టేబుళ్లకు సగటున 10 నుంచి 15 వేల ఓట్లను కేటాయించి వాటిలో చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసి అలాగే మొదటి ప్రాధాన్యతా క్రమంలో ఓట్లను వేరు చేసి లెక్కింపు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. మొదటి రౌండ్‌లో 10,783, రెండో రౌండ్‌లో 13,929, 3వ రౌండ్‌లో 11,870, 4వ రౌండ్‌లో 13,777, 5వ రౌండ్‌లో 13,168, 6వ రౌండ్‌లో 14,783, 7వ రౌండ్‌లో 12,841, 8వ రౌండ్‌లో 14,296, 9వ రౌండ్‌లో 14,162, 10వ రౌండ్‌లో 11,654, 11వ రౌండ్‌లో 13,674, 12వ రౌండ్‌లో 12,296, 13వ రౌండ్‌లో 12,523, 14వ రౌండ్‌లో 13,876, 15వ రౌండ్‌లో 14,668, 16వ రౌండ్‌లో 15,823, 17వ రౌండ్‌లో 4,879 ఓట్లను లెక్కించేలా ముందుగా నిర్దేశించారు. **అయితే టేబుల్‌కు 1,000 చొప్పున 28 టేబుళ్లలో రౌండ్‌కు 28 వేల ఓట్ల చొప్పున లెక్కిస్తున్నారు.**

కట్టలు కట్టేందుకే 12 గంటలు

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం
- రాత్రి 8.30 గంటల వరకూ కట్టలు కట్టడంతోనే సరి
- ఉభయగోదావరి జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాల్లో 1,368 బ్యాలెట్ బాక్సులు
- రాత్రి 9 గంటలకు ప్రారంభమైన చెల్లిన, చెల్లని ఓట్ల లెక్కింపు
- తొలిసారి ఏలూరు జిల్లాలో కౌంటింగ్ తంతు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రహసనంలా మారింది. రెండు జిల్లాల్లోని ఓట్లను కట్టలు కట్టడానికే 12 గంటలకు పైగా సమయం పట్టింది. ఏలూరు జిల్లా అధికార యంత్రాంగానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ తొలిసారి కావడం, ఇతరత్రా కారణాలుగా కనిపిస్తున్నాయి. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బందిని నియమించినా కౌంటింగ్ ప్రక్రియ వేగంగా సాగడం లేదు.

456 పోలింగ్ కేంద్రాల్లో.. : గత నెల 27న ఆరు జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ జరిగింది. ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. కౌంటింగ్‌కు ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ను ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేశారు. మొత్తంగా 456 పోలింగ్ కేంద్రాల్లో 3,14,984 మందికి గాను 2,18,997 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. 6.30 గంటలకే దాదాపు 250 మంది సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. మొత్తంగా 1,368 బ్యాలెట్ బాక్సులను 17 రౌండ్లుగా విభజించి కట్టలు కట్టే ప్రక్రియ ప్రారంభించారు. ఈ ప్రక్రియ రాత్రి 8.30 గంటల వరకు సాగింది. 28 టేబుళ్లను ఏర్పాటు చేసి 17 రౌండ్లుగా విభజించి కట్టలు కట్టిన ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం చేశారు. అనంతరం రాత్రి 9 గంటల నుంచి చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసి లెక్కింపు మొదలుపెట్టారు. ఈ ప్రక్రియకు సుమారు 2 గంటల సమయం పట్టే అవకాశం ఉంది.



ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్‌లో బ్యాలెట్ పేపర్లు కట్టలు కడుతున్న సిబ్బంది



బ్యాలెట్ బాక్సులు సీళ్లు తీస్తున్న దృశ్యం

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 242 కాగా.. చెల్లినవి 201, చెల్లనవి 41 ఉన్నాయి.

ఆరు జిల్లాల అధికారులున్నా ఆలస్యమే..

కౌంటింగ్ కేంద్రం వద్ద ఆరు జిల్లాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన డీఆర్వోలు, ఇతర జిల్లా స్థాయి అధికారులతో పాటు తహసీల్దార్లు, వివిధ విభాగాల అధికారులు విధుల్లో ఉన్నా లెక్కింపు ప్రారంభానికి తీవ్ర జాప్యం జరుగుతుంది. ఉదయం 6 గంటలకు విధుల్లోకి వచ్చిన వారు మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లిపోతారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టుల్లో లెక్కింపు జరుగుతోంది.

గుంటూరులో వేగంగా..

ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ గుంటూరులో కొనసాగుతోంది. అక్కడ కూడా 700 మంది సిబ్బంది, మూడు షిఫ్టులు ఇదే పద్ధతి ఉన్నా సాయంత్రం 4 గంటలకే కట్టలు కట్టడం పూర్తి చేసి 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. రాత్రి 8.30 గంటల సమయానికే మూడో రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. గతంలో నాలుగుసార్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ గుంటూరులో నిర్వహించడం, ఇతర కారణాలతో అక్కడ కౌంటింగ్ వేగంగా సాగుతోంది. ఏలూరు జిల్లాకు మొట్టమొదటిసారి కావడం, అధికారులకు అనుభవం తక్కువగా ఉండటం, ఇతర కారణాలతో ఇక్కడ మాత్రం ఆలస్యమవుతోంది. ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది మొత్తానికి భోజనాలతో సహా అన్ని ఏర్పాట్లు కౌంటింగ్ కేంద్రం వద్దే ఏర్పాటుచేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లు మొదటి రౌండ్ కౌంటింగ్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

గర్జించిన మున్సిపల్ కార్మికులు



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమ సుందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లోని కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రతపై మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యత ఉండాలన్నారు. వీటిని ప్రైవేట్ కంపెనీ, ఏజెన్సీలకు అప్పగించరాదన్నారు. భీమవరం పట్టణ అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్ని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బకాయిలను వెంటనే అందించాలని కోరారు. వైవీ ఆనంద్, కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో చేపట్టిన పలు సర్వేలను సకాలంలో పూర్తిచేసి నివేదికలను సమర్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆమె గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, తోలు కళాకారుల సర్వే, చైల్డ్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్ వివరాల నమోదు, జియో ట్యాగింగ్ హౌస్ హోల్డ్ రివెరిఫికేషన్ డెత్ మార్క్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఏపీ నాన్ రెసిడెంట్ మాడ్యూల్, ఎన్‌పీసీఐ లింకింగ్ తదితర అంశాలపై సమీక్షించారు.

పాలకొల్లులో మరో పసికందు గుర్తింపు



పాలకొల్లులో రెస్క్యూ చేసిన పసికందును అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

విజయవాడ స్పోర్ట్స్: నెలలు నిండని పసి కందులను విక్రయిస్తున్న విజయవాడ మహిళల ముఠా నుంచి మరో చంటి బిడ్డను ఎన్టీఆర్ జిల్లా పోలీసు యంత్రాంగం కాపాడింది. ఢిల్లీ, అహ్మదాబాద్ నుంచి చిన్నారులను తీసుకొచ్చి విజయవాడ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న విజయవాడ ముఠాను ఈనెల 1వ తేదీ శనివారం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ముఠా ఇచ్చిన సమాచారంతో 2వ తేదీ ఆదివారం రాజమండ్రిలో ఓ చంటి బిడ్డను పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో భాగంగా మరో పసికందును పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పోలీసులు గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కె.లతాకుమారి, మహిళా పోలీసులు ఈ పాపను వారి చేతుల్లోకి తీసుకొని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు.

కృత్రిమ మేధ వినియోగం పెరిగింది

తాడేపల్లిగూడెం: కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డ్రోన్ టెక్నాలజీ వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ జీవీవీ శర్మ అన్నారు. సోమవారం ఏపీ నిట్‌లో అన్మేన్డ్ ఏరియల్ వెహికల్స్ ఫర్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ అండ్ రిమోట్ సెన్సింగ్ అంశంపై జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రిమోట్ కంట్రోల్ సహాయంతో పనిచేసే సమర్థవంతమైన డ్రోన్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో పాల్గొన్న మరో అతిథి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మానవరహిత వాహనాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ దిశగా పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. నిఘా నేత్రాలుగా డ్రోన్లు అద్భుత పాత్ర పోషిస్తున్నాయని నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, డీన్ రవికిరణ్ శాస్త్రి అన్నారు. నైపుణ్యాల మెరుగుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఈసీఈ విభాగాధిపతి భానావతు నర్సింహారావు అన్నారు. వి.సందీప్, గుర్రాల కిరణ్‌కుమార్, కార్తికేయశర్మ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు, విద్యార్థులు

నేటి నుంచి పారిశుద్ధ్య సేవలు బంద్

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం నుంచి విధుల బహిష్కరణకు దిగుతున్నట్టు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ సంఘ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు చెప్పారు. సోమవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, 29 నెలలుగా పీఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా విస్తరించినా గతంలో ఉన్న 19 మంది కార్మికులతోనే పనులు చేయించడం శోచనీయమన్నారు.



తణుకు కేంద్ర ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

జరిమానాల మోత.. తస్మాత్ జాగ్రత్త

- ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన నిబంధనలు
- వాహనదారులు జాగ్రత్త పడాలని హెచ్చరిక
- ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

తణుకు అర్బన్: పిల్లాడు బండి నడిపేస్తున్నాడంటూ సంబర పడి మైనర్లకు బండి ఇస్తున్నారా.. కేరింతలు కొడుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారా.. హెల్మెట్ లేకుండానే బండి నడుపుతున్నారా.. రహదారుల్లో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేసేస్తున్నారా.. ఇన్సూరెన్స్ అవసరం లేదనుకుంటున్నారా అయితే ఇక మీకు జరిమానాల మోతమోగిపోతాది తస్మాత్ జాగ్రత్త. మార్చినెల 1 తేదీ నుంచి వచ్చిన నూతన వాహనాల చట్టం ప్రకారం నిబంధనలు మీరే వారికి జరిమానాలతో షాకిచ్చేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. మోటారు వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి వేసే జరిమానాలు హడలెత్తిస్తున్నాయి. ఈనెల 1వ తేదీ నుంచి వాహనదారులు నిబంధనలు పాటించకపోతే వేసే జరిమానాల తాలూకా ఫ్లెక్సీలను పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్లలో పోలీసులు ఏర్పాటుచేశారు. దీంతో నిబంధనలు పాటించని వారితోపాటు డ్రైవింగ్ లైసెన్సులు లేనివారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అంతేకాకుండా గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో సైతం కొత్త జరిమానాలు వైరల్‌గా మారాయి. లైసెన్సులు లేకుండా బండెక్కితే జరిమానాల మోత మోగనుందనే విధంగా నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు.



తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వద్ద ట్రాఫిక్ పోలీసులు

న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం

మార్చి 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నూతన మోటారు వాహన చట్ట నిబంధనలను అనుసరించి వాహన చట్ట ఉల్లంఘనపై పెంచిన జరిమానాలు ఎం.పరివాహన యాప్‌లో పొందుపరిచారు. అలాగే నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలివిగో అనే ఫ్లెక్సీలు తణుకులో గత రెండు రోజులుగా ప్రధాన కూడళ్లలో ప్రత్యక్షం కావడంతో వాహనదారులు ఆగి పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, రవాణా శాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగినా, సమాచారం ఇచ్చేందుకు నిరాకరించినా చట్టపరమైన చర్యలు కూడా తీసుకొనబడతాయంటూ ఫ్లెక్సీల్లో పొందుపరిచారు.

వేగానికి కళ్లెం పడనుందా..?

ప్రస్తుతం తణుకు పట్టణంలో వాహనాల వేగానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ముఖ్యంగా వాహనాల వేగాన్ని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. సైలెన్సర్‌లు తీసేసి నడుపుతున్న యువత, బైక్‌లపై స్టంట్‌లు చేస్తూ భయాన్ని ఉసిగొల్పుతున్న ఆకతాయిలపై తప్పనిసరిగా ఈ తరహా జరిమానాలు వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసు అధికారులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లోని అంశాలు..

ఉల్లంఘనలు	జరిమానాలు
హెల్మెట్ లేకపోతే	రూ.వెయ్యి
వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకుంటే	రూ.వెయ్యి
డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే	రూ.10వేలు
వాహనానికి బీమా లేకపోతే (మొదటిసారి)	రూ.వెయ్యి
రెండోసారి పట్టుబడితే	రూ. 2వేలు
శబ్దం – పొగ కాలుష్యానికి పాల్పడితే	రూ. 2వేలు
డేంజరస్ పార్కింగ్	రూ. 1500 నుంచి రూ.3వేలు
రేసింగ్ (ఓవర్‌స్పీడ్)	రూ.5 వేలు
డేంజరస్ డ్రైవింగ్	రూ.10 వేలు
మైనర్ డ్రైవింగ్	రూ.వెయ్యి
ప్రయాణికులను రవాణా వాహనాల్లో ఎక్కిస్తే ఒక్కరికి	రూ.200


ప్రమాదాల నివారణకే నూతన చట్టం



రోడ్డు ప్రమాదాల నివారణ, శబ్ద కాలుష్యం తదితర ఇబ్బందులను పరిష్కరించే ఉద్దేశ్యంతో ఏపీ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మోటారు వాహనాల చట్టం నూతన జరిమానాలు ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఇకపై తప్పనిసరిగా వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి. జాతీయ రహదారులతోపాటు పట్టణం, గ్రామాల్లో వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణాలు చేయాలి.

– ఎస్.కొండయ్య, తణుకు పట్టణ సీఐ

చంద్రబాబు నీతిమాలిన రాజకీయాలకు పరాకాష్ట


నౌడు వెంకట రమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ అధ్యక్షుడు

భీమడోలు: ప్రజా సంక్షేమం, అభివృద్ధిని మరిచి సీఎం చంద్రబాబు వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా కక్ష సాధింపు చర్యలకు, కుట్రపూరిత రాజకీయాలకు పెద్ద పీట వేయడం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ అధ్యక్షుడు నౌడు వెంకట రమణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను పాములతో పోల్చడం బాబు నీతిమాలిన రాజకీయాలకు పరాకాష్ట అని, ఆ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో నిర్వహించిన టీడీపీ ప్రజావేదికలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పనులు చేయవద్దని, వారికి పనులు చేస్తే పాములకు పాలు పోసినట్లేనని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 40 శాతం ఓటర్లను పాములుగా పోల్చడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కుల, మత, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఆయన్ను చూసైనా బుద్ధి మార్చుకోవాలని నౌడు హితవు పలికారు.

క్లుప్తంగా

చింతకాయల సత్యనారాయణకు గౌరవ పురస్కారం


పీటీ ఉష చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ వ్యాయమ ఉపాధ్యాయుడు చింతకాయల సత్యనారాయణ (పీడీ) గౌరవ పురస్కారం అందుకున్నారు. డెహ్రాడూన్ రాణా ప్రతాప్ సింగ్ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత పరుగుల రాణి, ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పెదపుల్లకాండి తెక్కె పెరంబుల్ ఉష, పీటీ ఉషచే గౌరవ పురస్కారం అందుకున్నారు. అథ్లెటిక్స్‌లో క్రీడాకారులను రాణించేలా తీర్చిదిద్దినందుకుగాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. క్రీడాకారులు, పీఈటీలు, పట్టణ ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

ఆచంటేశ్వరుని హుండీ లెక్కింపు


ఆలయంలో నిర్వహిస్తున్న హుండీ లెక్కింపు

పెనుగొండ: ఆచంటేశ్వరునికి రూ.4,88,159 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. సోమవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో హుండీ లెక్కించినట్లు వివరించారు. అదేవిధంగా శివరాత్రి సందర్భంగా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,11,351 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెక్కింపులో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నెక్కంటి గణేశ్వరరావు, ఆలయ అధికారులు గుబ్బల రామ పెద్దింట్లురావ పాల్గొన్నారని తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం


ఉప్పలపాటి దేవి మృతదేహం

పెనుగొండ: గోదావరిలో మహిళ మృతదేహం లభ్యమైంది. పెనుగొండ ఎస్సై కే గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రామపురం గ్రామానికి చెందిన ఉప్పలపాటి దేవి (23) ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. పెనుగొండలో ఓ శుభకార్యానికి హాజరయ్యే నిమిత్తం కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదం నెలకొనడంతో మనస్థాపానికి గురైన దేవి ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి పోయింది. బంధువులు వెతికినా ఆచూకి దొరకలేదు. ఈ తరుణంలో దొంగరావిపాలెంలో గోదావరిలో మృతదేహం లభ్యం కాగా ఆమె దేవిగా పోలీసులు గుర్తించారు. మనస్థాపానికి గురై దేవి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా


నూజివీడు పట్టణంలోని రామాయమ్మరావుపేట వద్ద ప్రమాదానికి గురైన ఆటో


వేరే ఆటోలో క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు


ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

- నలుగురికి తీవ్ర, 14 మందికి స్వల్ప గాయాలు
- ప్రియా పచ్చళ్ల కంపెనీలో పని కోసం వెళ్తూ గాయపడిన మహిళలు

నూజివీడు: పట్టణంలోని రామాయమ్మరావుపేట వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సమీపంలో సోమవారం ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో ఆటో డ్రైవర్ కాకుండా మిగిలిన 17 మంది మహిళలే. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు పట్టణంలోని కొప్పెలమపేటకు చెందిన మహిళలు పట్టణ పరిధిలోని సరస్వతీ ఆలయం సమీపంలో ఉన్న ప్రియా పచ్చళ్ల కంపెనీలో పనిచేసేందుకు ప్రతిరోజూ వెళ్తారు. వీరు ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు వస్తారు. దీనిలో భాగంగానే సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు డ్యూటీ దిగి 17 మంది మహిళలు ఆటోలో ఇంటికి వెళ్తుండగా రామాయమ్మరావుపేటలోని అన్న క్యాంటీన్ సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా కారు సందులో నుంచి రోడ్డుమీదకు వస్తుండటంతో దానిని తప్పించేందుకు ఆటోను డ్రైవర్ ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో ఆటో అదుపు తప్పి పక్కకు పడిపోయి పల్టీలు కొట్టి కరెంటు స్తంభాన్ని ఢీకొంది. స్థానికులు హుటాహుటిన క్షతగ్రాతులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ వైకుంఠపు అప్పలనాయుడు(40), సబ్బవరపు వరలక్ష్మి(40), నారగాని ఆదిలక్ష్మి(40), గేదెల వెంకటలక్ష్మి(50)లకు ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్సనందించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. మిగిలిన 14 మందికి ఏరియా ఆసుపత్రిలోనే చికిత్స నందిస్తున్నారు.

సామర్థ్యానికి మించి ఎక్కడమే కారణమా?

డ్రైవర్‌తో కలిపి ఐదుగురు ఎక్కాల్సిన ఆటోలో సామర్థ్యానికి మించి 18 మంది ఎక్కడమే ప్రమాదానికి కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూజివీడు పట్టణంతో పాటు రెడ్డిగూడెం, ఇతర గ్రామాల నుంచి కూడా ఇదే విధంగా ఓవర్‌లోడుతో ఆటోల్లో ప్రియాపచ్చళ్ల కంపెనీకి డ్యూటీ నిమిత్తం వచ్చి వెళ్తాంటారు. ఇంతకు ముందు వర్కర్ల కోసం బస్సును నడిపిన కంపెనీ కరోనా నుంచి ఆ సదుపాయాన్ని తొలగించింది. దీంతో అప్పటి నుంచి మహిళా వర్కర్లు ఆటోల్లోనే కంపెనీకి వచ్చి వెళ్తున్నారు. పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబుకు ఉగాది పురస్కారం


పంపన సాయిబాబును ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు జాతీయ ఉగాది పురస్కారం, విశ్వశాంతి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శ్రీ ఆర్యాణి సకల కళావేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, సినీ దర్శకుడు వి.సముద్ర, ఒమర్‌ఎజాస్ ఖాన్‌ల చేతులమీదుగా సాయిబాబు ఈ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు సాహిత్యానికి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకుగాను ఆయనకు ఈ పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ఈ అవార్డులు తనకు మరింత బాధ్యతను పెంచాయని, తెలుగు సాహిత్యం, పర్యావరణంపై విద్యార్థులు, ప్రజల్లో చైతన్యవంతం కలిగేలా మరిన్న రచనలు చేస్తానన్నారు. ఈ సందర్భంగా సాయిబాబాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాసు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేసుల రాజీకి కృషి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని న్యాయమూర్తులు పోలీసులకు సూచించారు. 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన పోక్సో కోర్టు హాల్‌లో సోమవారం పోలీసు అధికారులతో న్యాయమూర్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజీ చేసేందుకు ఏవిధమైన చట్టపరమైన సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కేసుల రాజీకి వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ జి.సురేష్‌బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పసిపాప అపహరణ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో రోడ్డుపై కాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకునే సంచార జాతులకు చెందిన పసిపాప అపహరణకు గురైంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని శనివారం సంత మార్కెట్ రోడ్డు వద్ద ఉషా స్కానింగ్ సెంటర్ ఎదురుగా ఉన్న మార్కెట్ స్థలంలో గుడారాలు ఏర్పాటుచేసుకుని సంచార జాతులు వారు నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి సరస్వతమ్మ, తన భర్త, పసి పాప (8 నెలలు)తో ఉషా స్కానింగ్ సెంటర్ పక్కన రోడ్డుపై పడుకున్నారు. తెల్లారి లేచిచూసేసరికి పాప కనిపించలేదు. రాత్రి 12 గంటల వరకూ పాప తమతోనే ఉందని వారు వాపోయారు. తాము పెన్నాడ నుంచి ఏడాది క్రితం ఇక్కడకు వచ్చి జీవనం సాగిస్తున్నామన్నారు. పసిపాపను వెతకడానికి అందరూ వెళ్లారని, ఇంకా కేసు పెట్టలేదని చెప్పారు.

పాము కాటుతో యువకుడు మృతి


మృతుడు జాన్(ఫైల్)

కైకలూరు: పొట్టకూటి కోసం చేపల పట్టుబడికి అమరావతి వెళ్లిన యువకుడు పాము కాటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన జయమంగళ నాగరాజు, మరియమ్మలకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమారుడు బతుకుదెరువు కోసం కర్ణాటక రాష్ట్రం వెళ్లాడు. చిన్న కుమారుడు జయమంగళ జాన్(18) పదో తరగతి వరకు చదివి తల్లదండ్రులకు ఆసరాగా మారాడు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన 11 మందితో కలసి అమరావతిలో చేపల చెరువు పట్టుబడి నిమిత్తం వాహనంలో వెళ్లారు. తెల్లవారుజామున 3 గంటలు కావడంతో ఉదయం చేపల పట్టుబడి చేద్దామని చెరువు గట్టు షెడ్డులో అందరూ నిద్రించారు. ఆ సమయంలో జాన్ పాము కాటుకు గురయ్యాడు. అయితే నిద్రమత్తులో ఉన్న జాన్ ఈ విషయం గమనించలేదు. ఉదయం రక్తపువాంతులు చేసుకోవడంతో అతడిని సమీపంలో ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు. అతను పాము కాటుతో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఇంటికి పంపారు.

ఐపీఎస్ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ధర్నా



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత జేఏసీ నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): దళిత ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ విధించడాన్ని దళిత జేఏసీ సంఘాల సభ్యులు ఖండించారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం దారుణమని దళిత జేఏసీ నాయకులు బండి మధు, గంటా సుందర్ కుమార్, కోనా జోసెఫ్, కేసీ రాజు అన్నారు. దళిత నాయకులు విమానాలు ఎక్కకూడదా .. ఎక్కితే సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. విల్లింగ్ ఇచ్చిన రెండోరోజున సస్పెండ్ చేయడం దళిత జాతిని అవమానించినట్లేనని, రాబోయే రోజుల్లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సునీల్ కుమార్ సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలురి చిన్నారావు, ఈది రవికుమార్, బేతల కమలాకర్, దర్శద, జి సందీప్, బి నాగరాజు, కేవీ రత్నం, వై జోసెఫ్, బొంగ ఆదాము, పిల్లి శేఖర్, జి బాలఏసు, ఎం.పీటర్ పాల్, ఎం.బెంజిమెన్, ఎండి శామ్యూల్, ఎం.ఏసురత్నం, వి ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల ధరలపై సీఎం దృష్టికి తీసుకువెళతాం

భీమవరం (ప్రకాశంచౌక్): రోజురోజుకు క్షీణిస్తున్న రొయ్యల ధరలపై ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తామని జిల్లా రొయ్య రైతుల వెల్ఫేర్ ఫెడరేషన్ కోర్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం భీమవరంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు మేత ధరల తగ్గింపులో ప్రభావం చూపకపోవడంతో రైతులు నష్టాలబారిన పడుతున్నారన్నారు. ధరలపై అప్సడా వైస్ చైర్మన్ ఆనం నారాయణరెడ్డి, ఫిషరీస్ కమిషనర్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. మరో పది రోజుల్లో తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు ఎన్.గజపతిరాజు, సుబ్బరాజు (జీకెఎఫ్), తులసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'జైన్' ఒప్పందం విద్యార్థులకు ఉపయోగకరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహారాష్ట్రకు చెందిన జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ అనే గ్లోబల్ కంపెనీతో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో జైన్ ఇరిగేషన్ సిస్టం నిర్వహిస్తున్న అత్యాధునిక టిష్యూ కల్చర్ ల్యాబ్ సదుపాయాలను, వారి రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ సెంటర్స్‌ను తమ విద్యార్థులు పరిశోధనల కోసం వినియోగించుకోవడానికి వీలు కలుగుతుందని ఉప కులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. రాష్ట్రంలో కోకో పంట అభివృద్ధికి, మార్కెటింగ్ సహకారానికి ఈ అవగాహన ఒప్పందం ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, జైన్ ఇరిగేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

పెంటపాడు: మోటార్‌సైకిల్‌ను వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అలంపురం జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన అలిసిపూడి శ్రీనివాస్ (50) పని నిమిత్తం ప్రత్తిపాడు వచ్చాడు. తిరిగి తాడేపల్లిగూడెం వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై అలంపురం జాతీయ రహదారి చేరుకోగానే జాతీయ రహదారి జంక్షన్ సమీపంలో వెనుక నంచి ఐషర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్సీలను అణగదొక్కడానికి కుట్ర


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు రాష్ట్రాల్లోని ఎస్సీలను అన్ని రంగాల్లో అణగదొక్కడానికి మనువాదులు కుట్ర చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి, మొత్తానికి ఎస్సీ రిజర్వేషన్ తీసివేసేందుకే ఈ కుట్ర అని అన్నారు. ఈ కుట్రలో మందకృష్ణ మాదిగను పావులా మనువాదులు వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కొన్నేళ్లుగా మాలలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయకుండా చూడాలన్నారు. మాలలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాలకు వెనుకాడరని హెచ్చరించారు. ఉన్నమట్ల విజయకుమారి, గుంపుల సత్యకృష్ణ, డెక్కపాటి రమణ, మరపట్ల రాజు, ఏలూరి రవి, భాస్కరరావు పాల్గొన్నారు.

చురుగ్గా పోలవరం ప్రాజెక్టు జంట సొరంగాల పనులు


పోలవరం ప్రాజెక్టు జంట సొరంగాల తవ్వకం పనులు జరుగుతున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పనులతో పాటు కుడి కాలువను అనుసంధానం చేసే ప్రాజెక్టు అనుబంధ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏలూరు జిల్లా పోలవరం మండలం తోటగొంది, మామిడిగొంది, దేవరగొంది గ్రామాల మధ్య గల జంట సొరంగాల పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. రెండు సొరంగాలను వెడల్పు చేస్తున్నారు. ఎంట్రీ, ఎగ్జిట్ ఛానల్ పనులు కూడా జరుగుతున్నాయి. 63వ ప్యాకేజీలో టన్నెల్ 715 మీటర్లు, 64వ ప్యాకేజీలో టన్నెల్ 826 మీటర్ల పొడవునా తవ్వకం పనులు జరిగాయి. సొరంగాల్లో షాట్ గ్రేటింగ్ పనులు జరుగుతున్నాయి. టన్నెల్స్‌లో లైనింగ్ పనులు చేపట్టేందుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో లైనింగ్ పనులు ప్రారంభించడం జరుగుతుందని ఈఈ బాలకృష్ణమూర్తి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహాలతో ఉండిలో కలకలం

ఉండి: రెండు రోజుల్లో రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం కావడంతో ఉండిలో కలకలం చోటుచేసుకుంది. ఆదివారం ఉండి శివారు గోరింతోట వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కాగా సోమవారం ఉండి ఇరిగేషన్ కార్యాలయం పక్కనే బొండాడ మేజర్ డ్రెయిన్‌లో మరో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఇద్దరి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, చనిపోయి సుమారు వారం రోజుల లోపు ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే మండలంలో ఇంతవరకు గత వారంగా ఎటువంటి అదృశ్య కేసులు నమోదు కాలేదు. దీంతో చనిపోయినవారు ఇతర ప్రాంతాలకు చెందినవారుగా భావిస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను ఆక్వా చెరువులపై పనిచేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందినవారు వస్తుండడంతో ఎవరు మిస్సింగ్ అయినా పోలీసులకు ఫిర్యాదులు అందడం లేదు. దీంతో శవాలు గుర్తు తెలియని మృతదేహాలుగానే మిగిలిపోతున్నాయి. వీటిపై సరైన విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన


అత్తిలి గోగులమ్మపేటలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

అత్తిలి: అత్తిలి శివారు గోగులమ్మపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గోగులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం గోపూజ, యంత్ర స్థాపన, కుంభాభిషేకం, శాంతి కల్యాణాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

అభయ గణపతికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో సోమవారం ఉదయం మందిరంలో శ్రీ అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు, పూలతో అర్చనలు జరిగాయి. సామూహిక శ్రీకృష్ణాష్టకము, పారాయణాలు జరిగాయి.ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

అక్రమ మద్యం స్వాధీనం


పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది

తాడేపల్లిగూడెం: గూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం సిబ్బంది చేసిన దాడుల్లో గణపవరం మండలం పిప్పర గ్రామంలో ఒక వ్యక్తి నుంచి సోమవారం డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 15 డ్యూటీపెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కామర్స్ ఫెస్ట్‌లో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: స్టేట్ లెవెల్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సావిస్కారా 2025 కార్యక్రమంలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి తెలిపారు. ఈనెల 1వ తేదీన రాజమండ్రిలో నిర్వహించిన ఫెస్ట్‌లో టవర్ బిల్డింగ్ విభాగంలో విద్యార్థినులు వై.ప్రేయర్‌గ్రేస్, బి.హేమలతశ్రీ ద్వితీయ స్థానాల్లోను, బిజినెస్ క్విజ్ విభాగంలో ఆర్.రేష్మా, పి.సౌజన్య, కె.సాయి జ్యోతి తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అభినందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ అధ్యాపకురాలు ఆర్.వెంకట దుర్గ, విద్యార్థినులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తణుకు అర్బన్: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం నుంచి ఈనె 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో 4 నెలల వయసుపైబడిన ఆవులు, గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, నాలుగు నుంచి 8 నెలల వయసు గల పెయ్యి దూడలకు బ్రూసెలోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ కరణం శంకర్ భావనారాయణ తెలిపారు. పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని పశువులన్నింటికీ టీకాలు వేయడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ముద్దాపురం, వేల్పూరు గ్రామాల్లోను, 5, 6 తేదీల్లో కోనాల, వేల్పూరు, 7, 8, 10 తేదీల్లో దువ్వ, వేల్పూరు, 11న దువ్వ, మహాలక్ష్మి చెరువు, 12న దువ్వ, యర్రాయి చెర్వు, 13, 14 తేదీల్లో దువ్వ, కొమరవరం, 15, 17 తేదీల్లో తేతలి, 18, 19, 20 తేదీల్లో మండపాక గ్రామంలో టీకాలు వేయడం జరుగుతుందని వివరించారు.

సాగునీరందక రైతుల ఇబ్బందులు

- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- అక్కరకు రాని వంతుల వారీ విధానం

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో సాగునీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెంటపాడు ఆయకట్టు అయిన దర్శిపర్రు మిడ్‌లెవెల్ కాలువ నుంచి నెంబర్–1 చానల్ ద్వారా 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందడం లేదు. ఫలితంగా పెంటపాడు, జట్లపాలెం ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ చానల్ ద్వారా వచ్చీరాని నీటిని ఇంజన్‌ల ద్వారా తోడుకొంటున్నారు. ప్రత్తిపాడులోని వీర్లకృష్ణ రైసుమిల్లు ప్రాంతంలో జాతీయ రహదారిని ఆనుకొని సుమారు 100 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఈ ప్రాంత రైతులు కారేలతో నీటిని తోడుకొంటున్నారు. వంతుల వారీ విధానం వీరికి అక్కరకు రావడం లేదన్నారు. ఇప్పుడిప్పుడే చేలు పాలుపోసుకొంటున్న తరుణంలో సాగునీరు ఎంతో అవసరమన్నారు. సాగునీరు లేకపోతే పంటలు ఎండిపోతాయని పలువురు రైతులు వాపోతున్నారు.

నెర్రలు తీసిన 200 ఎకరాలు:
విప్పర్రులో ఉప్పరగూడెం పాయకు చెందిన మూడు పుంతలలో 200 ఎకరాలు నెరలు తీసాయి. ఈ ప్రాంతంలో సాగునీరు అందడం


జట్లపాలెం ఆయకట్టు వద్ద అడుగంటిన నెంబర్–1 ఛానల్


రాచర్ల, వల్లూరుపల్లి గ్రామాల వద్ద కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

లేదని రైతులు పెనుమాక సుబ్బారాయుడు, లక్ష్మడు, యడవల్లి చినవెంకన్న, పెనుమాక గాంధీ, అడపా గోతియ తదితరులు ఆవేదన చెందుతున్నారు. తమ చేలు నెరలు తీసి వారం రోజులు అవుతోందన్నారు. వంతుల వారీ విధానం వల్ల తమకు నీరు అందడం లేదన్నారు. మిడ్‌లెవెల్ కాలువ ద్వారా జట్లపాలెం ఎస్కేప్, అక్కడ నుంచి ఉమామహేశ్వరం, కాకర్లమూడి నుంచి విప్పర్రుకు మెండేల్ కాలువ ద్వారా సాగునీరు రావాల్సి ఉండగా ఎగువ ప్రాంత రైతులు తమకు నీటిని అందించడం లేదని విప్పర్రు రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. ప్రభుత్వం, ఇరిగేషన్‌శాఖ, సాగునీటి యాజమాన్యాలు కలిసి సమావేశాలు నిర్వహించుకోవాల్సి ఉండగా ఆ చర్యలు కానరావడం లేదన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేసినా శివారు ప్రాంతమని తమను పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం సాగునీరందించి తమను ఆదుకోవాలన్నారు. లేకపోతే రైతులంతా కలిసి రోడెక్కుతామని ఉప్పరగూడెం రైతులు వాపోయారు. ఈ విషయంపై ఎఈ కిరణ్‌కుమార్‌ని వివరణ కోరగా ఇప్పటికే కొన్ని ఎకరాలకు సాగునీరు అందించామని, వంతుల వారి విధానం ద్వారా అన్ని ఎకరాలకు నీరు అందిస్తామన్నారు.


విప్పర్రు ఉప్పరగూడెం పాయలో నీరందక నెర్రలుతీసిన మట్టిని చూపుతున్న రైతు రాముడు


పెంటపాడు మిడ్‌లెవెల్ నెంబర్–1 ఛానల్ నుంచి ఇంజన్ ద్వారా నీరు తోడుకుంటున్న రైతులు


వరిపైరు పాలుపోసుకొంటున్న దృశ్యం

కొనసాగుతున్న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


బీవీఆర్‌లో సంగీత కచేరీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో సోమవారం రాత్రి త్యాగరాజు స్వామి 84వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. త్యాగరాజు గాన సభ అధ్యక్ష, కార్యదర్శులు గరికిపాటి బాపయ్య శర్మ, సరస్వతుల హనుమంతరావు పర్యవేక్షించారు. మల్లెల కాంతి స్వరూప్ (హైదరాబాద్) వారిచే సంగీత కచేరీ జరిగింది. వైలన్‌పై ఎం వాసు శాస్త్రి, మృదంగంపై కె.యోగేష్, ఘటంపై ఎం.హరిబాబులు సహకారం అందించారు. కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, కర్రి ప్రభాకర్ బాలాజీ, దాసరి కాశీ విశ్వనాథ్, యద్దనపూడి సుబ్బారావు, పీటీ వెంకన్న కళాకారులు, సాహితీ సభ్యులు, త్యాగరాజు స్వామి భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో సంబరాలు

అత్తిలి: ఉత్తరాంధ్రా టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ తరపున మూడోసారి గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపొందడం పట్ల అత్తిలి మండల పీఆర్‌టీయూ సంబరాలు జరిపారు. సోమవారం అత్తిలి పీఆర్‌టీయూ భవనంలో జరిగిన ఈవేడుకలో గాదె శ్రీనివాసులునాయుడుకి అభినందనలు తెలుపుతూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ స్టేట్ కౌన్సిలర్ టి గణపతి, జిల్లా కార్యదర్శి జి రాజేష్‌కుమార్, అత్తిలి మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ప్రసన్నకుమార్, టి చిరంజీవిమిత్ర, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆరుగొలను, ఆరుళ్ల, మారంపల్లి, నందమూరు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను కలిసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు వెలిశెట్టి నరేంద్రకుమార్, ప్రత్తి రఘు, కల్లేపల్లి సుబ్బరాజు, మానికొండ నాగేశ్వరరావు, మానుకొండ సుభాష్, దాసరి అక్షయ్, కోలాటి హరనాథ్, బయ్యే సంశోన్, బెజవాడ నరసింహమూర్తి, పొలాసు గంటయ్య, చక్రాల రవికుమార్, చదలవాడ గోపి, ఉప్పలపు రాజబాబు, వీర్లపాటి సత్యనారాయణ, తమ్మాబత్తుల రఘునాథం, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.


నందమూరు గ్రామంలో జరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం దృశ్యం

పాఠశాలను తరలిస్తే పోరుబాట పడతాం

తణుకు అర్బన్: తణుకు బ్యాంక్ కాలనీలోని మునిసిపల్ నంబరు 15 ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలకు తరలిస్తున్నారనే సమాచారంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు సోమవారం పాఠశాల వద్ద తమ నిరసన తెలిపారు. ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్ర కార్యదర్శి చివటం శివ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. తణుకు పట్టణంలో నంబరు 15 మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను పట్టణంలోని వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రభుత్వం సిద్ధపడుతుందని, ఈ పాఠశాల వేరే ప్రాంతానికి తరలించడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు ధ్వజమెత్తారు. స్థానికంగా ఉంటున్న తల్లిదండ్రులకు తమ పిల్లలను దూరంగా ఉండే మరో పాఠశాలకు పంపించాలంటే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని తెలిపారు. ఈ పాఠశాలను ఇప్పుడు ఉన్నచోటే కొనసాగించాలని, మార్చే ఉద్దేశ్యంలో ఉంటే విద్యార్థి సంఘాలన్నీ ఏకమై విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలబడి పోరుబాట పడతామని హెచ్చరించారు. ఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లిమిల్లి వంశీ, కన్వీనర్ నామన శ్రీచందన, జిల్లా నాయకులు, దున్న వెంకట్, పొన్నాడ అరుణ్, వి.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.


తణుకులో నంబరు 15 పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు

స్పీచ్ థెరపీతో వినికిడి సమస్యలను తగ్గించవచ్చు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పీచ్ థెరపీతో మాటలు నేర్పించడం వల్ల వినికిడి సమస్యలను తగ్గించవచ్చునని పలువురు ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకొని పిల్లల్లో వినికిడి సమస్య, చిన్న వయస్సులో గుర్తించే విధానంపై భవిత సెంటర్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వినికిడి సమస్యలు ఉన్న పిల్లలకు క్లాక్ క్లియర్ ఇన్వెంటేషన్ ఆపరేషన్లు చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినికిడి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం వహించవద్దని సమగ్ర శిక్ష ద్వారా ఉచితంగా అవసరమైన వారికి వినికిడి యంత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాలను తప్పక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వై.అనిల్ కుమార్, హెచ్ఎం బి.జ్యోతి, సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారిలు పాల్గొన్నారు.


ప్రపంచ వినికిడి దినోత్సవంలో పాల్గొన్న దివ్యాంగులు తదితరులు

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

తణుకు అర్బన్: పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ తక్షణమే అమలు జరిపి పేదల సొంతింటికల నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలను డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్లకు వేలాది రూపాయిలు బాడుగలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పేదలు అద్దె ఇళ్లల్లో కాకుండా సొంత ఇళ్లలో ఉండే పరిస్థితి కల్పిస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు వరకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన పేదల ఇళ్ల స్థలాలు హామీ అమలయ్యేవరకు ఉద్యమిస్తామని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మార్చి15 న భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ఇళ్ల స్థలాల వ్యక్తి గత అర్జీలు జిల్లా కలెక్టరుకు సమర్పిస్తామని స్పష్టం చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, రాష్ట్ర సమితి సభ్యురాలు వై.నాగలక్ష్మి, సీపీఐ నాయకులు నామాన వెంకటేశ్వరరావు, ఎస్.రామశ్రీను, జక్కంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తణుకు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మెట్ట ఉప్పరగూడెంలో ఎస్సైకి ఘన స్వాగతం


ఎస్సై నాగప్రసన్నకి స్వాగతం పలికిన ఉప్పరగూడెం సర్పంచ్ కనకబాబు, గ్రామస్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దండే నాగప్రసన్న ఎస్సై శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం సాయంత్రం గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల జల్లు కురిపించారు. ఉప్పరగూడెం సర్పంచ్ దండే కనకబాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దండే నాగప్రసన్న మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తనపై గ్రామస్తులు చూపిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను కడప సచివాలయంలో మహిళా సంరక్షణాధికారిగా పనిచేస్తూ జీవితాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్న ఆకాంక్షతో ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. తన భర్త, అత్తింటి వారి సహకారంతో తాను ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకుని నేడు గ్రామానికి రావడం జరిగిందన్నారు. తనకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరున అభినందనలు తెలిపారు. బీజేపీ నాయకుడు కొల్లి రాజశేఖర్, గ్రామస్తులు వాడపల్లి సుబ్బరాజు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు


ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వానపల్లిగూడెంలో కనకదుర్గమ్మ అమ్మవారికి, ఆలయ వార్షికోత్సం సందర్భంగా సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, దుర్గ హోమం, కుంకుమ పూజలు జరిగాయి. గణేష్ కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. తద్వారా కుటుంబం విద్య, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ జరిపి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.తులసీ, టి.రామలక్ష్మి, కే.గీత, ఎం.శాంతకుమారి, పి.అంజి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై పి ప్రేమరాజు సోమవారం చెప్పారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామానికి చెందిన నేలపాటి బుజ్జమ్మ ఇంటర్ పూర్తిచేసి, ఇంటివద్దే ఉంటుంది. ఈనెల 2వతేదీ మధ్యాహ్నం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి మణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని కలిగి ఉండాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ అన్నారు. సోమవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో బేసిక్ కోర్స్ స్కాట్స్, మాస్టర్ గైడ్, కెప్టెన్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ పశ్చిమ నుంచి 24, ఏలూరు జిల్లా నుంచి 26 పాఠశాలలు భారత స్కాట్స్, గైడ్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు స్కాట్స్, గైడ్ కార్యక్రమంలో పాల్గొని దేశానికి మంచి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కాట్స్, గైడ్ సెక్రటరీ ఉంగరాల నాగేశ్వరరావు, ఎంఈవో వి.హనుమ, ప్రిన్సిపల్ బి.రాజారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురుకులంలో జరిగిన శిక్షణ కార్యక్రమం

సర్వేలను నూరు శాతం పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: సర్వేలో వెనుకబడిన గ్రామాలు మార్చి నెలాఖరు లోగా నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సర్వేలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని సర్వేల్లో జిల్లాలోనే మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ కే.వెంకట్రావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలో తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని శ్రీ వాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదేవిధంగా పెంటపాడు జూనియర్ కళాశాలలో సోమవారం రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2014 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1990 మంది పరీక్షలకు హాజరైయారు. 24మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

అఖండ అన్నసమారాధన

అత్తిలి: మహాశివరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన జరిపారు. అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

